నేడు ఆలయంలో వేలంపాట

2 నుంచి బ్రహ్మోత్సవాలు

జగద్గిరిగుట్ట, జనవరి 21 : దేవాదాయశాఖ పరిధిలోని జగద్గిరిగుట్ట లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 2నుంచి 4వరకు జరుగుతాయని ఈవో కృష్ణమాచార్యులు తెలిపారు. స్వామివారి కల్యాణం 3న జరుగుతుందని, ఇందుకోసం నూతన కార్యవర్గంతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయ హుండీ ద్వారా ఐదునెలలుగా భక్తులు సమర్పించిన రూ.2.69 లక్షలు సమకూరిందని, వేడుకల్లో కొబ్బరికాయలు, లడ్డూ విక్రయంకోసం బుధవారం వేలంపాట నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు. ఆసక్తిగలవారు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

జీహెచ్‌ఎంసీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

దుండిగల్, జనవరి 21: జీహెచ్ ఎంసీ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ కార్మికులతో కలిసి మంగళవారం ఆయన సూరారం డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లోని వార్డు కార్యాలయం వద్ద అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 100డివిజన్లలో సుమారు 20వేల మంది మున్సిపల్ సిబ్బంది, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఫిక్స్‌డ్ తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించి, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలన్నారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద జరుగుతున్న మహాధర్నాలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దేవదానం, నాయకులు పసుల అంజయ్య, మున్సిపల్ కార్మికులు కౌసల్య, రాములమ్మ, పెంటమ్మ, ధనమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి..

- వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

జలమండలి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 21 : డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించే దిశగా పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు భారీ రిజర్వాయర్లను నిర్మించి, కాలనీలు, బస్తీల్లో పైప్‌లైన్ పనులు చేపట్టామని, ఈ పనులతో దాదాపుగా తాగునీటి సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన పనుల్లో అక్కడక్కడ పైప్‌లైన్ పనులు, జంక్షన్‌ల అభివృద్ధి పనులు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అసంపూర్తి పనులతో కలుషిత తాగునీటి సరఫరా, లోప్రెషర్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలు, బస్తీల్లో అభివృద్ధి పనులు చేస్తున్నప్పుడు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ...వెంటనే ఆ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో పనులు చేస్తున్నప్పుడు జీహెచ్ ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వేసవిలో ఇబ్బందులకు రాకుండా..

రానున్న వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, కాలనీల వారీగా సమస్యలు గుర్తించి ముందస్తుగా పనులు చేయాలన్నారు. కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తే... ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తానని తెలిపారు. డివిజన్‌ల వారీగా సమస్యలను గుర్తించాలన్నారు. ఇప్పటికే చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం ప్రభాకర్‌రావు, ప్రాజెక్ట్ విభాగం ఇంజినీర్ అజయ్, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహాబేగం పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఆమెకు పూలబొకె అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్ డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కవిత భర్త భాస్కర్ మంగళవారం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డిలు బాలానగర్ రాజుకాలనీలోని భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భాస్కర్ హఠాత్తుగా మృతి చెందడం ఆయన కుటుంబానికి తీరనిలోటు అని అన్నారు. *– బాలానగర్, జనవరి 21*

వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధిని పెంచేందుకు కృషి

కాటలిస్ట్ వ్యవస్థాపకురాలు, డాక్టర్ ఉషా యనమండ్ర

మాదాపూర్, జనవరి 21: భారతదేశంలో 45 ఏండ్లుగా ఇమేజ్ కన్సల్టింగ్ అనేది చాలా మాన్యువల్ ప్రక్రియగా ఉండిపోయిందని కాటలిస్ట్ వ్యవస్థాపకురాలు, డాక్టర్ ఉషా యనమండ్ర అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ అడ్మిన్ బ్లాక్‌లో మంగళవారం ఏఐ పవర్డ్ ఇమేజ్ కన్సల్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాటలిస్ట్ వ్యవస్థాపకురాలు, డాక్టర్ ఉషా యనమండ్ర విచ్చేసి స్వీడెన్, యుఏఈ గ్లోబల్ ఆర్ట్ డైరెక్టర్ మాస్టర్ బిబో సినీ నటి పూనమ్ కౌర్, రాయల్టీ విత్ ద రాయల్స్ చైర్మన్ నవాబ్ సైయద్ ఆల్గాజి, టీ మబ్ సీఓఓ, ఫౌండర్ శ్రీనివాస్ కొల్లిపారా, వంశీరామ్ బిల్డర్స్ ఫౌండర్, చైర్మన్ శ్రీనివాస బాలాజీ రెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతదేశంలో ఇమేజ్ కన్సల్టింగ్ అనేది చాలా మాన్యువల్ ప్రక్రియగా ఉండిపోయిందని, కాటలిస్ట్ ద్వారా ప్రపంచంలోనే మొట్టమొదటి ఆల్ పవర్డ్ పర్సనల్ స్టైలింగ్, ఇమేజ్ డెవలప్‌మెంట్ సర్వీస్‌ను ఆవిష్కరించడంతో వ్యక్తిగత స్టైలింగ్, ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ కొత్త శిఖరాలకు చేరుకున్నట్లు చెప్పారు. వినూత్న ప్లాట్‌ఫారమ్ ఇమేజ్ కన్సల్టింగ్ ల్యాండ్ స్కేప్‌ను మార్చడానికి ప్రొఫెషనల్ స్టైలింగ్ అత్యాధునిక కృత్రిమ మేధస్సును మిళితం చేస్తుందనడంలో సందేహం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన గ్లోబల్ ఆర్ట్ డైరెక్టర్, మోడల్ కోచ్, స్వీడన్, యుఏఈలో ఉన్న వైస్ అకాడమీ సీఈఓ మాస్టర్ బిబో మధ్య ప్రతిష్టాత్మకమైన కూటమిని సూచిస్తుందన్నారు. ప్రపంచ స్థాయిలో వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. నేటి వేగవంతమైన ప్రపంచంలో మీ ప్రతిరూపమే గుర్తింపుగా లెక్కలేనన్ని అవకాశాలను అన్‌లాక్ చేయగలదని, కాటలిస్ట్ యొక్క వినూత్న విధానం ప్రజలు తమ ఉత్తమ స్వభావాలను కనుగొనడంలో సహాయం చేస్తుందని నటీ పూనమ్ కౌర్ అన్నారు. కార్యక్రమంలో పలువురు కాటలిస్ట్ సభ్యులు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ప్రజలకు అందుబాటులో ఉండాలి..

- సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలి
- పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి..
- బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 21 : ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని, కాలనీలు, బస్తీల్లో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, బీఆర్ఎస్ అధ్యక్షకార్యదర్శులు, ముఖ్యనేతలతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందిందని, చేసిన పనులు కాలనీలు, బస్తీల్లో ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు కష్టంవస్తే తన దృష్టికి తీసుకురావాలని, వారికి అండగా ఉంటానన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ పాలనలో పడుతున్న ఇబ్బందులను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో పార్టీని ఆదరించడం ఖాయమన్నారు. నేతలు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీశ్‌అరోరా, కార్పొరేటర్లు శ్రీనివాస్‌రావు, జూపల్లి సత్యనారాయణ, ముద్దం నర్సింహా యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్, పగుడాల శిరీషా, సబిహాబేగం, మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్లు బాబురావు, శ్రావణ్‌కుమార్, మాధవరం రంగారావు, డివిజన్‌ల అధ్యక్షులు ఇర్ఫాన్, భిక్షపతి, శాకయ్య, సురేశ్‌యాదవ్, అయిలయ్య, శ్రీనివాస్, నేతలు సాయిబాబాచౌదరి, శ్యామలరాజు, రాములు, మక్కల నర్సింగరావు, ప్రభాకర్, హరినాథ్, నరేంద్ర గౌడ్, జంగయ్య, సుధాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బొట్టు విష్ణు, సత్యం, సతీశ్‌రావు, రాజేశ్ రాయ్, తిరుపతి, నరేశ్, ఖాజా ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రజా వెల్ఫేర్ సొసైటీ నూతన సభ్యులు

మూసాపేట, జనవరి 21: మూసాపేటకు చెందిన ప్రజా వెల్ఫేర్ సొసైటీ నూతన సభ్యులను మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు.. మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ఆయన నివాసంలో కలిశారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వినోద్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... ప్రజా వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థలోని ప్రతినిధులు చిరు ఉద్యోగులు అయినప్పటికీ చాలా సంవత్సరాలుగా బస్తీ ప్రజలకు మేలు చేసే విధంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు తుకారాం, నర్సింహా, వెంకటస్వామి, జైరాజ్, అరుణ్, కార్యదర్శి రమేశ్, అర్జున్, సంజయ్, అంబ్రోస్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరికిచెరువు, ఆలయ భూముల

కబ్జా వీడేనా..!

నేడు జగద్గిరిగుట్ట భూముల కబ్జాలపై హైడ్రా సమావేశం

జగద్గిరిగుట్ట, జనవరి 21 : చెరువుతో మొదలైన కబ్జాల బండారం ఆలయ భూముల వరకూ కొనసాగగా హైడ్రా దృష్టి సారించింది.. జగద్గిరిగుట్ట భూ ఆక్రమణలు తవ్వే కొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. ఆరునెలల క్రితం వచ్చిన హైడ్రా కమిషనర్.. గత శనివారం మరోసారి పర్యటించడంతోపాటు బుధవారం తమ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. భూదేవిహిల్స్ సమీపంలోని పరికి చెరువు పూడ్చివేతపై ఫిర్యాదులతో ఆరునెలలక్రితం హైడ్రా అధికారులు బేస్‌మెంట్లు కూల్చారు. చెరువులో శ్మశానం కోసమంటూ రోడ్డు నిర్మాణం చేయడం వివాదాస్పదమైంది. గాజులరామారం డివిజన్, మహదేవపురం వైపు కూడా చెరువు ఎఫ్టీఎల్‌ను నిర్ధారించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు అందాయి. మరోవైపు జగద్గిరిగుట్ట సర్వేనంబర్ 348/1 అంతా ప్రభుత్వ భూమి కావడంతో జనావాసాలు వెలియడంతోపాటు కబ్జాలు సాగాయి. దేవాదాయశాఖ పరిధిలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆయం కొండపై ఉన్న సుమారు 14 ఎకరాల్లో కుల సంఘాలు , ఆలయాలపేరుతో స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. రింగుబస్తీ, రాజీవ్‌గృహకల్పను ఆనుకుని ఉన్న పలుచోట్ల ప్లాట్లు చేసి విక్రయించారు. వేంకటేశ్వర ఆలయం సమీపంలోని గోవిందరాజులగుడి ఎదురుగా ఉన్న కోనేరు స్థలం కబ్జా యత్నాలతో ఆలయపూజారి కన్నీరు పెట్టుకున్న వీడియో వైరల్‌కావడంతో ఈనెల 18న హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈనేపథ్యంలో బుధవారం ఏర్పాటు చేసే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజాగా సీపీఐ నేతలు మరోసారి రంగనాథ్‌ను కలిసి వివరాలతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. భూదేవిహిల్స్‌లో ఓ వ్యక్తి, మహదేవపురంలో ఓ నిర్మాణ సంస్థ, మరికొన్ని నిర్మాణాలతో చెరువును కబ్జా చేయగా.. దీనికి అధికారులిచ్చిన అనుమతులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వేంకటేశ్వర ఆలయం సరిసరాల్లో ఆలయాలన్నీ దేవాదాయ శాఖ పరిధిలోకి తేవడం, స్థలాల ఆక్రమణదారులతోపాటు అనుమతిలేకుండా నిర్మించిన భారీ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అంతా హైడ్రా అనకుండా రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్, ఇతరశాఖల అధికారులు సమన్వయం చేయాలని సూచిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన నేతలు, అధికారులకు చెక్ పెట్టాలని కోరుతున్నారు. హైడ్రా సమావేశంతో ఇంతకాలం తాము చేసింది చెల్లుబాటైందనుకున్న కబ్జాదారుల గుండెల్లో ఇకపణుకు ప్రారంభమవుతోంది. త్వరలోనే జగద్గిరిగుట్ట లక్ష్మీవెంకటేశ్వర ఆలయం బ్రహ్మోత్సవాలు జరగనుండటంతో అప్పటిలోగా గ్రహణం వీడాలని భక్తులు కోరుతున్నారు.

ప్రణీత్‌బ్లూమ్స్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

దుండిగల్, జనవరి 21 : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట్‌లోని ప్రణీత్‌బ్లూమ్స్‌కు ఆర్టీసీ సౌకర్యం కల్పించాలని కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ కేఎల్ బాబు విజ్ఞప్తి మేరకు మంగళవారం కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలతలు పర్యటించారు. ఈ సందర్భంగా మాదాపూర్, హైటెక్‌సిటీ నుంచి నిజాంపేట్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్ కమాన్ మీదుగా బౌరంపేట్‌లోని డీపీ ఎస్, త్రిపుర, శంభీపూర్‌మీదుగా ప్రణీత్ బ్లూమ్స్ వరకు ఆర్టీసీ సర్వీసులు నడిపించేందుకు గల సాధ్యసాధ్యాలను పరిశీలించారు. కాగా తమ కాలనీ నుంచి హైటెక్‌సిటీ, తదితర ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించడం ఎంత అవసరమో ఈ సందర్భంగా బాబు ఆర్టీసీ అధికారులకు వివరించగా.. వారు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఆడపిల్లల చదువుకోసం ఆర్థిక సహాయం

అల్లాపూర్, జనవరి 21 : అల్లాపూర్ డివిజన్, శివాజీనగర్‌కు చెందిన రమేశ్ కొద్ది రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడగా.. అతనికి ఇద్దరు ఆడపిల్లలు. వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న అయ్యప్ప సంక్షేమ సంఘం సభ్యులు ఆడ పిల్లల చదువు నిమిత్తం ఒక్కో అమ్మాయి పేరు మీద రూ. 50వేలు మొత్తం రూ. 1లక్ష రూపాయలు పిక్స్‌డ్ డిపాజిట్ చేసి మంగళవారం పాస్‌బుక్‌ను అందజేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

దుండిగల్, జనవరి 21: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, 18వ డివిజన్ కావ్య ఎవెన్యూ కాలనీ, నందనవనం కాలనీల్లో అభివృద్ధి పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, కొలన్ హన్మంత్‌రెడ్డి, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేశ్‌రెడ్డి, ఆగంపాండు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

దుండిగల్, జనవరి 21 : సీఎం సహాయనిధి నిరుపేదలకు పెన్నిధిగా మారిందని అని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మహంకాళి కృష్ణకు రూ.57,500, తడకల మంజులకు రూ.60వేలు, కళ్లెం రవీందర్‌గౌడ్‌కు రూ.30వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో కృష్ణయాదవ్, నగేశ్, మధుసూదన్, వెంకటేశ్వర్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం..

పవన్ మణికంఠ (ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 21 : నాకు మరొక జీవితం ఉంటే...ఇదే కుటుంబం..ఇదే స్నేహితులను ఇవ్వాలని దేవున్ని ప్రార్థిస్తున్నాను... ఈ రోజు నా మరణం కోసం వెళ్తున్నాను అని.... ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్‌ను పోస్ట్ చేసిన ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీకి చెందిన చింత లపవన్ మణికంఠ (19) కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ... చైతన్య అకాడమీలో కోచింగ్ తీసుకుంటున్నాడు. సంక్రాంతికి ఊరెళ్లి తిరిగి ఈ నెల 21 ఉదయం 4.30 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీకి చేరుకున్నాడు. ఇక్కడకు చేరుకున్నానని, హాస్టల్‌కు వెళ్లి కోచింగ్ వెళ్తానని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పిన పవన్ మణికంఠ...ఆ తర్వాత కనిపించకుండా పోయాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, బంధుమిత్రులను విచారించినా ఫలితం లేకపోవడంతో ఆయన బంధువు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వార్డు సభలు.. గందరగోళం

అర్హులను గుర్తించడంలో విఫలం..అధికారుల నిలదీత, ఆగ్రహం

దుండిగల్‌లోని మూడవ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

దుండిగల్, జనవరి 21 : డబుల్ బెడ్ రూమ్ పథకానికి సంబంధించి అర్హులు ఎంతోమంది ఉండగా కొందరినే ఎంపికచేయడం ఏంటని దుండిగల్ వాసులు ప్రజాపాలన వార్డు సభల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం 1వ నుంచి 7వ వార్డు వరకు ఆయాప్రాంతాల్లో ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుండిగల్‌లోని 3వ వార్డుకు సంబంధించిన సభను 4వ వార్డులో, 4వ వార్డుకు సంబంధించిన సభను 3వ వార్డులో ఏర్పాటు చేయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. 1వ వార్డు గాగిల్లాపూర్ వార్డు సభలో అర్హుల జాబితా ప్రకటనపై స్థానికులు అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు చాలామంది అర్హులు ఉండగా కొందరినే ఎంపిక చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల సర్వే, రేషన్‌కార్డు దరఖాస్తుదారులు, రైతు భరోసా లిస్టులో పేరులేని అర్హులైన వారి వద్ద నుంచి నూతనంగా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇప్పటివరకు 7 వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు దరఖాస్తులు, రైతు భరోసా మొదలగు వాటిని 906 తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి.లక్ష్మయ్య, రెవెన్యూ ఆఫీసర్ బి.ప్రభాకర్, మున్సిపల్ ఇంజినీర్ బి.సురేందర్ నాయక్, టీపీబీవో సంజన, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌లో....

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, 7వ డివిజన్‌లోని ఎన్‌టీఆర్ నగర్‌లో ప్రజాపాలన వార్డు సభలో డిప్యూటీ మేయర్ ధన రాజ్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ ప్రణయ్ యాదవ్, 20వ డివిజన్ కార్పొరేటర్ బాలా జీనాయక్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, స్థలం ఉన్న నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సహాయం, అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డుల కోసం 184మంది గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ మంజునాథ్, మేనేజర్ జయరాజు, వార్డు ఆఫీసర్ పూర్ణిమ, సీనియర్ అసిస్టెంట్ ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

రసాభాసాగా కొంపల్లి వార్డు సభ..

-కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం

కొంపల్లిలోని వార్డు నంబర్ 3లో జరిగిన వార్డు సభలో అధికారులను నిలదీస్తున్న చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్, జనవరి 21 : కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు వార్డు సభలను ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా మంగళవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆరు వార్డుల్లో వార్డు సభలు జరిగాయి. మూడవ వార్డులో జరిగిన సభ రసాభాసాగా మారింది. స్థానికంగా చైర్మన్‌గా ఉన్న బీఆర్ఎస్ నేత సన్న శ్రీశైలంయాదవ్‌కు అధికారులు లబ్ధిదారుల ఎంపిక విషయంపై ఏమాత్రం సమాచారం ఇవ్వలేదు. దీంతో సభలో ఆయన.. అధికారుల తీరుపై మండిపడ్డారు. తన వార్డులో 28 మంది రేషన్‌కార్డుదారులు అర్హులని గుర్తిస్తే వారిలో ఐదుగురిని మాత్రమే ఏ ప్రాతిపాదికన ఫైనల్ లిస్ట్ చేస్తారని కమిషనర్ శ్రీహరిని ప్రశ్నించారు. ఇదే సమయంలో ఒకే వేదికపై కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత జెమ్మి దేవేందర్ కూర్చోవడంతో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ కలగచేసుకొని వేదికపై నేతలు కూర్చుంటారని, ఏదైనా ఉంటే సభ ముందు ఉండి చర్చించాలని సూచించడంతో అక్కడున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. దీంతో అక్కడే ఉన్న మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు కలగచేసుకొని ఇరువురిని శాంతింపచేశారు. కమిషనర్ శ్రీహరి మాట్లాడుతూ.. తమకు పైనుంచి ఇచ్చిన ఆదేశాల మేరకు అర్హుల లిస్ట్‌ను గుర్తించామని, ప్రస్తుతం 28 మంది రేషన్‌కార్డుదారులకు వారిలో సగానికి పైగా అనర్హులుగా ఉన్నట్లు తమ సర్వేలో తేలిందని, అందుకే మూడవ వార్డులో ఐదుగురిని అర్హులుగా గుర్తించామని తెలిపారు. అయినా ఇంకా అర్హులుగా ఉన్నవారు ఉంటే కాగితంపై తమకు పేర్లు ఇవ్వాలని, దీనినిపై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

సర్కిల్ వ్యాప్తంగా వార్డు సభలు

మియాపూర్ , జనవరి 21 : ప్రభుత్వ ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్ వ్యాప్తంగా రేషన్ కార్డుల అర్హులపై వార్డు సభలను నిర్వహించినట్లు సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సర్కిల్ పరిధిలోని వార్డు కార్యాలయాల్లో ఈ ప్రక్రియను పరిశీలించారు. ఎస్‌కేఎస్ ఆధారంగా వచ్చిన దరఖాస్తులపై ఇంటింటి విచారణ చేపట్టి .. నిర్దిష్ట విధానాలకు అనుగుణంగా అర్హుల వివరాలను నమోదు చేశామన్నారు. ఈ జాబితాలను వార్డు సభలో కార్పొరేటర్ల సమక్షంలో ప్రదర్శించి అభ్యంతరా